క్లుప్తంగా

రూ.5 లక్షలతో హైమాస్ట్ లైట్లు



అయిజ: పట్టణంలోని కొత్త బస్టాండ్ కూడలిలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులు హైమాస్ట్ లైట్లు ఏర్పాటుకు భూమి పూజ చేశారు. మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి రూ.5 లక్షల నిధులతో కొత్త బస్టాండ్, పెద్దవాగుపై నిర్మించిన బ్రిడ్జి వద్ద హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ రాజశేఖర్, టీపీబీఓ సాత్విక్, కాంట్రాక్టర్ మాధన్న, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు

విపత్కర సమయాల్లో అప్రమత్తంగా ఉండాలి



గద్వాల క్రైం: హోంగార్డుల సమస్యల పరిష్కారం కోసం పోలీసుశాఖ చర్యలు తీసుకుంటుందని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం జిల్లాలో పోలీసుశాఖలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులకు రెయిన్ జాకెట్లను ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విపత్కర సమయల్లో సిబ్బంది కృషి అభినందనీయమన్నారు. వర్షాకాల సమయంలో వరదలు వచ్చిన నేపథ్యంలో హోం గార్డులు విధులు నిర్వహించి ప్రజలకు నమ్మకం కలిగించారన్నారు. పలు విపత్కర సమయల్లో సిబ్బంది శ్రమించారన్నారు. అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా హోం గార్డు సిబ్బంది రెయిన్ జాకెట్లను అందజేసిందన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాల్సిందిగా సిబ్బందికి తెలియజేశారు. .

నిల్వ నీటిని తొలగించుకోవాలి



ఇటిక్యాల: పంట పొలాల్లో నిల్వ ఉన్న వర్షపు నీరు తొలగించుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి వెంకటేష్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని సాతర్ల గ్రామంలో రైతులతో కలసి ఆయన మిరప పంటను పరిశీలించారు. పంట సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి రైతులకు అవగాహన కల్పించారు. చీడపీడల నివారణకు తగు మోతాదులో మందులను సకాలంలో పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు షేక్ అబ్దుల్లా, గోపాల్, రాములు, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

డీలర్‌పై చర్యలు శూన్యం

మానవపాడు: అక్రమంగా డబ్బులు వసూలు చేసిన రేషన్ డీలర్‌పై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మకు వినతిపత్రం అందజేశారు. గత జూలైలో 40కి పైగా రేషన్ సరుకుల పట్టిక పుస్తకాలు లబ్ధిదారులకు ఇవ్వడం కోసం రూ.150 చొప్పున వసూలూ చేసినట్లు అధికారులు తెలిపారు. పత్రికల్లో డీలర్ అవినీతిపై ప్రచురితమైన ఇంత వరకు చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే చర్య తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జయరాజ్, శ్రీను మాదిగ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

అలంపూర్: పెండింగ్‌లో ఉన్న కళాశాల విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని ఏబీవీపీ నగర కార్యదర్శి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. అలంపూర్ చౌరస్తాలో ఫీజు రీయింబర్స్‌మెంట్, పెండింగ్ స్కాలర్ షిప్‌లను విడుదల చేయాలని విద్యార్థులతో కలిసి సోమవారం నిరసన తెలిపారు. అంతకుముందు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలిలో బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ విద్యార్థుల బలిదానాలు, ఉద్యమాలతో సిద్ధించిందని, రాష్ట్ర సాధనలో విద్యార్థుల పాత్ర కీలకంగా ఉందన్నారు. కానీ అదే రాష్ట్రంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. గురుకుల పాఠశాలల్లో అనేక మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో ఆస్పత్రుల పాలయ్యారని, కానీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కనీసం స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదన్నారు. రాష్ట్రంలో రూ.8600 కోట్ల స్కాలర్‌షిప్‌లు పెండింగ్ ఉన్నాయని, ఇప్పటికైనా విద్యార్థుల శ్రేయస్సు ఆలోచించి త్వరగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్‌డీ–కో కన్వీనర్ వెంకటేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లోకేష్ తదితరలు ఉన్నారు.

శక్తి స్వరూపిణి.. పాహిమాం



ఉండవెల్లి గాంధీనగర్‌లో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



షాబాద్‌లో బాలత్రిపురసుందరీదేవిగా..

సాక్షి నెట్‌వర్క్: దేవి నవరాత్రుల్లో భాగంగా మొదటి రోజు సోమవారం అమ్మవారు బాలత్రిపురసుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శాంతినగర్‌లోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఆలయ చైర్మన్ రావూరి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. అభిషేకాలు, కుంకుమార్చనలు, హోమాలు చేశారు. అనంతరం బతుకమ్మ ఉత్సవాలను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు.

- రాజోళి మండల కేంద్రంలో శరన్నవరాత్రులు ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం కుంకుమార్చనలు చేశారు.
- ధరూరు మండల కేంద్రంలోని కాళికాదేవి ఆలయంలో అమ్మవారిని బాలత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. కుంకుమార్చన, కలశపూజ, గణపతి పూజ, బిల్వార్చన వంటి క్రతువులు నిర్వహించినట్లు అర్చకులు కిష్టాచార్యులు పేర్కొన్నారు.
- మల్దకల్ మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో బాలత్రిపుర సుందరిదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పద్మశాలీ సంఘం నాయకులు మార్కండేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. ఆదిశిలా క్షేత్రంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.
- మానవపాడు మండలంలోని పల్లెపాడులో దసరా నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



ధరూరులో బాలత్రిపురసుందరీదేవిగా ..

- ఇటిక్యాల మండలంలోని పెద్దదిన్నే వేంకటేశ్వరస్వామి ఆలయం, షాబాద్ గ్రామంలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు. సుప్రభాతసేవ, క్షీరామృతాభిషేకం, ఆరాధన, కుంకుమార్చన వంటి క్రతువులు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.
- అయిజ పట్టణంలోని కాళికాదేవి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని మేళతాళాలు, మంగళవాయిద్యాలతో ఘనంగా ఊరేగించారు. అనంతరం ఆలయంలో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పల్లకీసేవ, నందికోల సేవలు జరిపించారు.



పల్లెపాడులో దుర్గాదేవిగా అమ్మవారు



ఉండవెల్లిలో అమ్మవారి ఊరేగింపులో యువత

- ఉండవెల్లి మండలంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల వద్ద భక్తుల ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



ముండ్లదిన్నెలో అమ్మవారికి పూజలు చేస్తున్న గ్రామస్తులు



గద్వాల వాసవీ ఆలయంలో ధ్వజారోహణంలో ఆర్యవైశ్యులు



ఉండవెల్లి అనసూయమ్మ కాలనీలో పూజలందుకుంటున్న అమ్మవారు



మల్దకల్ మార్కండేయస్వామి ఆలయంలో..

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

అలంపూర్: కర్నూలులోని క్యాంప్ కార్యాలయంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే విజయుడు సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. మానవపాడు మండలం పల్లెపాడుకు చెందిన రంగస్వామికి రూ. 11500, అలంపూర్ మండలం సుల్తానాపురానికి చెందిన విజయలక్ష్మమ్మకు రూ.5 వేలు మంజూరైనట్లు తెలిపారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని పార్టీ మండల అధ్యక్షుడు అడ్డాకుల రాము అన్నారు. పట్టణంలోని సంతోష్ నగర్‌లో చిన్నబాబుకు రూ.26 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసనట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పెద్దబాబు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నరసింహ, జాన్, బాబు, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.



సీఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

పారదర్శకంగా జాబితా సవరణ

అయిజ: ఓటర్ల జాబితా సవరణను పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దార్ జ్యోతి సిబ్బందికి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, మున్సిపాలిటీల కార్యాలయాల సిబ్బంది 'తెలంగాణ ఈ సవరణ' కార్యక్రమం చేపట్టారు. 2002– 25 ఓటర్ల జాబితా మధ్య పోలిక చేయడం, మృతులు, వలసల వల్ల తొలగించబడిన పేర్లు, తప్పులు సవరణలు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. 2002– 25 సంవత్సరం ఓటర్ల జాబితాలో (రెండింటిలో) పేర్లు నమోదైన వారిని 'ఏ' కేటగిరిలో, 2002లో ఓటర్ల జాబితాలో పేర్లు లేకుండా ఉండి 1–7–1987 కంటే ముందు జన్మించిన వారిని 'బీ' కేటగిరి, 1987 నుంచి 2004 సంవత్సరాల మధ్య జన్మించిన వారిని 'సీ' కేటగిరిలో, 2004 సంవత్సరం తర్వాత జన్మించిన వారిని 'డీ' కేటగిరిలో నమోదు చేయాలని తహసీల్దార్ సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఓటర్ జాబితా సవరణ చేస్తున్న సిబ్బంది

లబ్ధిదారుల పేరుతో ఇసుక పక్కదారి

రాజోళి: లబ్ధిదారుల పేరుతో ఇసుక పక్కదారి పడుతుందని కేవీపీఎస్ మండల ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ రామ్మోహన్‌కు వినతిపత్రం అందచేశారు. తుమ్మిళ్లలో లబ్ధిదారులకు ఇసుక అందించేందుకు రీచ్ ఏర్పాటు చేశారని, కానీ లబ్ధిదారులకు అందడంలో పలు సమస్యలు ఉత్పన్న మవుతున్నాయన్నారు. లబ్ధిదారుల పేరుతో ఇసుక పక్కదారి పట్టించేందుకు పలువురు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. లబ్ధిదారులకు ఇసుక అందక నిర్మాణాలు నిలిచిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు చొరవ తీసుకుని ఇసుక సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరారు. ఆనంద్‌బాబు, బెత్లాహేం, చాంద్‌బాషా, లక్ష్మన్న పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కేవీపీఎస్ నాయకులు

పరువు నష్టం కేసు నమోదు

గద్వాల క్రైం: అసత్య ఆరోపణలు చేస్తూ పరువు నష్టం కలిగిస్తున్న వ్యక్తులపై పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు అబ్దుల్ ఖదీర్ తెలిపారు. మండలంలోని సంగాల శివారులో 95 సర్వే నంబర్‌లో కొంత భూమిని 2012లో కొనుగోలు చేశానని, అయితే అట్టి భూమికి 2014లో గద్వాల తహసీల్దార్ పాస్‌బుక్‌లను సైతం జారీ చేశారన్నారు. ఇట్టి క్రమంలో హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ యాకుబ్ మైనోద్దీన్ అట్టి భూములను వక్ఫ్‌బోర్డుకు చెందిన భూములుగా పేర్కొని అకారణంగా పలు సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేస్తున్నాడన్నారు. తమను భూ కబ్జాదారులుగా పేర్కొంటున్నారని వాపోయాడు. ఈ మేరకు పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్‌ను సాక్షి వివరణ కోరగా.. బాధితుడి ఫిర్యాదు మేరకు సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రాజోళి వాసుల సమస్యలు పట్టవా?

రాజోళి: కొత్త రాజోళిలో ప్రజలు నిత్యం సమస్యలతో సావాసం చేస్తున్నారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సంజీవరెడ్డి అన్నారు. సోమవారం బీజేపీ మండల అధ్యక్షుడు శశికుమార్ ఆధ్వర్యంలో కొత్త రాజోళి, వీవర్స్ కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వర్షాలకు జలమయమైన కాలనీలు, ఇళ్ల మధ్య నిలిచిన మురుగు, దోమలు, పందులు ఏర్పాటు చేసుకున్న స్థావరాలను చూసి అధికారుల తీరుపై మండిపడ్డారు. మురుగుతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నా అధికారులు కన్నెత్తి చూడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కాలనీల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోవిందరాజులు, వీరేష్, తిరుమలేష్ తదిదరులు పాల్గొన్నారు.



బురదలో ఉన్న కాలనీలను చూపిస్తున్న బీజేపీ నాయకులు

విద్యుత్ సరఫరాలో అంతరాయం

అయిజ: నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు చేపట్టిన మరమ్మతులో భాగంగా మంగళవారం మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏడీఈ నీలి గోవిందు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయిజ, ఎక్లాస్‌పురం, బింగుదొడ్డి, దేవబండ గ్రామాల్లో ఉదయం 7.30 నుంచి 9.30 వరకు, తుపత్రాల, మేడికొండ, కేశవరం గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి 12 సరఫరా నిలిపివేస్తున్నటు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏడీఈ కోరారు.

ప్రైవేటు పాఠశాలలపై చర్య తీసుకోండి



అయిజ: నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నగర సంయుక్త కార్యదర్శి నరేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బీజీఆర్ హైస్కూల్‌ను ఏబీవీపీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు సెలవులు ప్రకటించినా సరే కొన్ని పాఠశాలలు ప్రైవేటు క్లాసుల పేరుతో పాఠశాలలను నిర్వహిస్తున్నారన్నారు.ఆయా పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్య తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు విజయ్, రహీం, మధు, బన్ని పాల్గొన్నారు.

నాన్ టీచింగ్ ఉద్యోగుల అరెస్ట్

ఉండవెల్లి: కేజీబీవీల్లోని నాన్ టీచింగ్ క్యాడర్ ఉద్యోగులు చలో హైదరాబాద్ ధర్నాకు పిలుపునిచ్చిన నేపథ్యంలో మండల కేంద్రంలో అయి దుగురు ఉద్యోగులను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టైన ఈశ్వరమ్మ, ఆశీర్వాద మ్మ, పద్మావతి, మైబునిసా, మిరాజ్ బేగంను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

రక్షణ కంచె కరువాయె!



ధరూరులో ఉన్నత పాఠశాల వద్ద ప్రమాదభరితంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు

- ట్రాన్స్‌ఫార్మర్లతో పొంచి ఉన్న ప్రమాదం
- గ్రామీణ ప్రాంతాల్లో కంచెలేని వైనం
- చోద్యం చూస్తున్న విద్యుత్ అధికారులు

ధరూరు: మండల పరిధిలో ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాద భరితంగా ఉన్నాయి. రోడ్లు, పాఠశాలలు, ముఖ్యంగా కూడళ్ల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రమాదం పొంచి ఉంది. వినియోగదారులతో బిల్లులు వసూలు చేసేందుకు విద్యుత్ అధికారులు చూపుతున్న శ్రద్ధ, ప్రమాదభరిదంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణ కంచె ఏర్పాటు చేయడంపై లేదని మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

- మండల కేంద్రంలో గద్వాల– రాయచూర్ రహదారిపై మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అదే విధంగా స్థానిక రైస్‌మిల్ వద్ద
- నెట్టెంపాడు గ్రామంలో ఎస్సీ కాలనీతో పాటు కమ్యూనిటీ హాల్ వద్ద
- ఉప్పేరు పునరావాస కేంద్రంలో సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు
- మన్నాపురం, దోర్నాలలో ఇళ్లపై నుంచి వెళ్లిన హైటెన్షన్ విద్యుత్ తీగలతో ప్రమాదం పొంచి ఉంది. అదే విధంగా పలు గ్రామాల్లో ఎర్త్ సమస్యలు అధికంగా ఉన్నాయి.



మన్నాపురంలో ఇళ్ల మధ్య..

షార్ట్ సర్క్యూట్‌తో అవస్థలు

మండలంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదాలకు కారకాలుగా మారాయి. మండల పరిధిలో నిత్యం ఎర్త్ సమస్యలు అధికంగా ఉన్నట్లు ప్రజలు పేర్కొంటున్నారు. మండల పరిధిలోని ద్యాగదొడ్డిలో ఇళ్ల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌తో గతంలో ఓ ఆవు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. ముఖ్యంగా ఎర్త్‌లు సరిగా లేకపోవడంతో తరచూ ఇళ్లల్లో షార్ట్ సర్క్యూట్ ఏర్పడడంతో విలువైన వస్తువులు దగ్ధమవుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు.



నెట్టెంపాడులో ఇళ్ల మధ్య ఇలా...

కంచె ఏర్పాటు చేయాలి



ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎర్త్‌లను ఏర్పాటు చేయడంతో పాటు రక్షణ కంచె ఏర్పాటు చేస్తే బాగుంటుంది. అదే విధంగా గ్రామాల్లో దశాబ్దాల క్రితం వేసిన పాతలైన్లు తొలగించి వాటి స్థానంలో నూతన వైర్లు ఏర్పాటు చేయాలి.

– లేమిరాజ్, ధరూరు

పట్టించుకోవడం లేదు



మా గ్రామంలో చాలా కాలంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రమాదం పొంచి ఉంది. ఎస్సీ కాలనీతో పాటు కమ్యూనిటీ హాల్ వద్ద ఉన్న రోడ్డు పక్కన కంచె లేకుండా ఉంది. విద్యుత్‌శాఖ అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు.

– గోవిందు, నెట్టెంపాడు.

నివేదించాం

మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణ కంచె ఏర్పాటు గురించి గతంలో ఎస్టిమేషన్లు వేసి ప్రభుత్వానికి అందజేశాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడాతాం. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకుంటాం.

– అనిల్‌కుమార్‌రెడ్డి, ఏఈ

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

అలంపూర్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడా లని మున్సిపల్ కమిషనర్ శంకర్, తహసీల్దార్ మంజుల అన్నారు. పట్టణంలోని గాంధీచౌక్‌లో మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ సోమవా రం పరిశీలించారు. ఉత్సవాలకు భక్తులు పెద్దఎత్తున రానున్న నేపథ్యంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతు చేయాలి



ఉండవెల్లి: మండల కేంద్రం నుంచి హైవేకు వెళ్లే రహదారికి మరమ్మతు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఒక్కసారి కూడా పంచాయతీరాజ్ శాఖ అధికారులు పరిశీలించిన దాఖలాలు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు పరిశీలించి రోడ్డుకు మరమ్మతు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజు, నాగరాజు, మద్దిలేటి, రాముడు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

27న ప్రత్యేక వైద్య శిబిరం

ఇటిక్యాల: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ నెల 27న ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి రాధిక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంటి వైద్యులు, గైనకాలజిస్ట్, జనరల్ ఫిజీషియన్, డెంటల్ సర్జన్, పీడియాట్రిక్స్, ఈఎన్‌టీ, సైకియాట్రిక్ వైద్యులు రానున్నట్లు పేర్కొన్నారు, ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.